సాక్షి
జనగామ

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



ముగిసిన సంతోష్ ప్రస్థానం
విప్లవ గీతాలకు ఆకర్షితుడై, నమ్మిన సిద్ధాంతం కోసం 23 ఏళ్ల క్రితం అడవిబాట పట్టిన మవోయిస్టు అన్నె సంతోష్ అలియాస్ సాగర్ ప్రస్థానం ముగిసింది. - 8లో



ఈత..ఆరోగ్య ప్రదాత - 8లో
వారం రోజుల నుంచి పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందడానికి.. చక్కటి వ్యాయామం కోసం స్విమ్మింగ్‌కు బయలుదేరుతున్నారు.

గరిష్టం/కనిష్టం
$42^0/25^0$

వాతావరణం
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.



న్యూస్‌రీల్

సోమేశ్వరాలయంలో శనిత్రయోదశి పూజలు



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకొని నవగ్రహ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనీశ్వరుడికి నువ్వుల నూనెతో అభిషేకం చేసి నలుపు పట్టు వస్త్రాలతో అలంకరించిన అనంతరం భక్తులు పూజలు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

జనగామ: జిల్లాలో శనివారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 12 మండలాలను వాతావరణ శాఖ ఆరెంజ్ జోన్ (అలర్టు)గా ప్రకటించింది. పాలకుర్తి, జఫర్‌గఢ్‌లో అత్యధికంగా 43.7 డిగ్రీల సెల్సియస్, చిల్పూరు, జనగామ 43.6, బచ్చన్నపేట 42.2, రఘునాథపల్లి 42.1, దేవరుప్పుల 41.6, స్టేషన్‌ఘన్‌పూర్ 41.3, కొడకండ్ల 41.1, నర్మెట 41, లింగాలఘణపురం 40.9, తరిగొప్పులలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్రమశిక్షణ చర్యలు తప్పవు

లింగాలఘణపురం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా ఏనెబావి గ్రామానికి చెందిన ప్రజ్ఞాపురం ఆంజనేయులును ప్రకటించామని పేర్కొన్నారు. ఆయన పేర్కొన్న మండల కమిటీ మాత్రమే నిజమైనదన్నారు. కొంత మందితో మరో కమిటీని ప్రకటించుకున్నట్లు తెలిసిందని, ఇలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు.

కలలను సాకారం చేసుకోవాలి



లింగాలఘణపురం: అబ్దుల్ కలాం మాదిరిగా విద్యార్థి దశలో కన్న కలలను భవిష్యత్‌లో సాకారం చేసుకోవాలని డీఈఓ రాము అన్నారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో విద్యార్థులు రోబోటిక్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సెల్ఫ్ వాటరింగ్ ప్లాంట్, సెక్యూరిటీ లాక్ సిస్టమ్, కారు పార్కింగ్ సపోర్టింగ్ సిస్టమ్, స్మార్ట్‌డోర్ లాక్, ఆల్కహాల్ డిటెక్టర్ వంటి పరికరాలను డీఈఓ పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహకంగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పకుమారి, అటల్ టింకరింగ్ ఇన్‌చార్జ్ అరవింద్, ట్రెయినర్ రమేష్ పాల్గొన్నారు.

మార్కెట్‌కు వరుస సెలవులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌కు నేటి(ఆదివారం) నుంచి మూడు రోజులు సెలవు ప్రకటించినట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జి.భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న సాధారణ సెలవు, 8న అమావాస్య, 9న ఉగాది పండుగ సందర్భంగా మార్కెట్ బంద్ ఉంటుందని, 10వ తేదీ బుధవారం పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో రైతుల వ్యవసాయ ఉత్పత్తులు అమ్మకానికి తెచ్చి ఇబ్బంది పడొద్దని సూచించారు.

రైతు ఆత్మహత్య కేసులో సర్వేయర్ అరెస్ట్

బచ్చన్నపేట : మండల పరిధి పడమటికేశ్వాపూర్‌కు చెందిన రైతు కొమ్మాట రఘుపతి ఆత్మహత్య చేసుకున్న కేసులో సర్వేయర్ కె.రవీందర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై కంకల సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ భూమి రిజిస్ట్రేషన్ చేయడానికి రైతు రఘుపతి వద్ద సర్వేయర్ రవీందర్ నేరుగా డబ్బులు తీసుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈవిషయంలో నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడు సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

పిలుపొస్తే 'కారె'క్కుడే!

- మళ్లీ బీఆర్ఎస్‌లోకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య
- హైకమాండ్ సూచనతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంతనాలు
- కేటీఆర్, హరీశ్‌రావుతో మాట్లాడిన తాటికొండ?
- స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్‌తోపాటు కీలక బాధ్యతలు
- పార్టీ వీడొద్దంటూ కేడర్‌కు రాజయ్య పేరిట వాట్సాప్ సందేశాలు
- కేసీఆర్ పిలుపు కోసం వెయిటింగ్.. భారీగా కేడర్‌తో చేరేందుకు సన్నాహాలు



సాక్షిప్రతినిధి, వరంగల్: మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కారెక్కేందుకు సిద్ధమయ్యారా? అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఫిబ్రవరి 3న బీఆర్ఎస్ పార్టీకి, పదవులకు రాజీనామా చేసిన ఆయన మళ్లీ మనసు మార్చుకున్నారా? మొదట కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైన రాజయ్య.. తన చిరకాల ప్రత్యర్థి కడియం శ్రీహరి అదే పార్టీలో చేరిన నేపథ్యంలో 'యూ' టర్న్ తీసుకున్నారా? తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరి.. స్టేషన్‌ఘన్‌పూర్ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించనున్నారా? అంటే నిజమేనంటున్నాయి ఆయన అనుచర వర్గాలు. అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్ఎస్‌లోనే ఉన్న రాజయ్య.. ఆ ఫలితాలు వెలువడి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ పెద్దలను కలిసిన ఆయన ఇటు బీఆర్ఎస్‌లో కొనసాగకుండా.. అటు కాంగ్రెస్‌లో చేరకుండా స్తబ్దతగా ఉన్నారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమైన రాజయ్య.. తన పేరిట 'నేను మళ్లీ వస్తున్నాను.. ఎవరూ పార్టీని వీడకండి' అంటూ వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు పంపుతుండటంతో ఆయన చేరిక ఖాయమైందన్న చర్చ జరుగుతోంది.

బీఆర్ఎస్ పెద్దలతో పూర్తయిన చర్చలు..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌లో రాజుకున్న అసంతృప్తి.. ఓటమి తర్వాత.. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బట్టబయలైంది. స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, రైతుబంధు సమితి మాజీ చైర్మన్ డాక్టర్ తాటికొండ రాజయ్య, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌తో మొదలైన రాజీనామాల పరంపర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వరకు కొనసాగింది. తన చిరకాల ప్రత్యర్థి కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య బీఆర్ఎస్‌ను వీడటం.. రాజయ్యను కాంగ్రెస్‌లో చేరడమా? బీఆర్ఎస్‌లో కొనసాగడమా? అన్న సందిగ్ధ స్థితిలో పడేసింది. ఇదే సమయంలో ఆయన రాజీనామా ఇంకా ఆమోదం కాకపోవడంతో బీఆర్ఎస్ హైకమాండ్ రాజయ్య విషయంలో పునరాలోచనలో పడింది. ఈ మేరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రంగంలోకి దిగి డాక్టర్ టి.రాజయ్యతో మంతనాలు జరిపినట్లు తెలిసింది. వారంలో రెండు పర్యాయాలు రాజయ్యతో మంతనాలు జరిపిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో కూడా మాట్లాడించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్న రాజయ్య.. పార్టీ అధినేత కేసీఆర్ నుంచి సమయం తీసుకుని పెద్ద సంఖ్యలో కేడర్‌తో కలిసి కారెక్కుతారన్న చర్చ ఆయన అనుచరవర్గంలో జరుగుతోంది. 'సారు నుంచి పిలుపు రావడమే ఆలస్యం.. కారెక్కుతాం' అని పేర్కొంటున్నారు.

'స్టేషన్' ఇక రాజయ్యదే.. అధిష్టానం హామీ..

హైకమాండ్ సూచన మేరకు బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్న టి.రాజయ్య.. చర్చల సందర్భంగా పలు అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన తాను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీని వీడి టీఆర్ఎస్(బీఆర్ఎస్)లో చేరానని, కడియం శ్రీహరి కూడా పార్టీలో చేరాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని వివరించినట్లు సమాచారం. గ్రూపు రాజకీయాలతో అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టాలని చూసినా.. టికెట్ రాకుండా చూడటం కోసం దుష్ప్రచారాలు చేయించినా.. చివరకు టికెట్ ఇవ్వకపోయినా.. హైకమాండ్ ఆదేశాలకు కట్టుబడి పని చేశానన్న ఆయన ఇకనుంచైనా భరోసా ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌తో పాటు పార్టీలో కీలకంగా కొనసాగేలా అవకాశం కల్పించనున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇదంతా జరిగిన మీదటే తాను మళ్లీ పార్టీలోకి వస్తున్నానని, ఎవరూ కూడా కాంగ్రెస్, బీజేపీలకు వెళ్లవద్దని కోరుతూ వాట్సాప్ గ్రూపుల ద్వారా కేడర్‌కు సందేశాలు పంపినట్లు చెబుతున్నారు. రెండు రోజుల్లో తేదీ ప్రకటించి కేడర్‌తో కలిసి రాజయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరుతారని సమాచారం.

నేడు మోడల్‌స్కూల్ అడ్మిషన్ టెస్ట్

- 8 సెంటర్లు.. 1,253 మంది విద్యార్థులు
- 6వ తరగతికి ఉదయం 10 నుంచి 12..
- 7 నుంచి 10వ తరగతికి మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు పరీక్ష



బచ్చన్నపేట మోడల్ స్కూల్ సెంటర్

జనగామ: మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యాసంవత్సరం అడ్మిషన్ కోసం ఆదివారం(నేడు) నిర్వహించే పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. డీఈఓ రాము నేతృత్వంలో సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పరీక్ష సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో నిర్వహించే ఈ ఎంట్రన్స్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1,253 మంది విద్యార్థులు హాజరుకానుండగా జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, నర్మెట, బచ్చన్నపేట, జనగామ, లింగాలఘనపురం, కొడకండ్ల ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో ఏర్పాట్లు చేశారు. 6వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7, 8, 9, 10వ తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది. నిర్వహణపై డీఈఓ పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెంటల్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఎండలు తీవ్రమైన నేపథ్యంలో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. విద్యార్థులు సెంటర్లకు నిర్దేశిత సమయానికి గంట ముందే చేరుకోవాలి. పరీక్ష ప్రారంభమైన 15 నిమిషాల తర్వాత హాజరైన విద్యార్థుల సంఖ్యను ఉన్నతాధికారులకు పంపిస్తారు. సెంటర్‌లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైస్ వాచ్‌లకు అనుమతి లేదు. పరీక్ష నిర్వహణకు సంబంధించి మరిన్ని వివరాలకు ఏసీజీఈటీ రవికుమార్(99895 44981)ను సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

తరగతుల వారీగా ఎంట్రెన్స్ రాసే విద్యార్థుల వివరాలు

తరగతి	6వ	7వ	8వ	9వ	10వ
విద్యార్థులు	871	151	126	91	14

అవసరమైన ఏర్పాట్లు చేశాం



జిల్లాలోని మోడల్ స్కూళ్లలో 6 నుంచి పదో తరగతి వరకు 2024–25 విద్యాసంవత్సరం అడ్మిషన్ల కోసం నేడు నిర్వహించే పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలి. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాం. కేంద్రాల సమీప జిరాక్స్ సెంటర్లను మూసివేయాలి.

– రాము, జిల్లా విద్యాధికారి

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: సమాజంలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా ఆస్పత్రిలో ప్రజలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం 'మన ఆరోగ్యం మన హక్కు' అనే నినాదంతో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే 50 శాతం ఆరోగ్యంగా ఉన్నట్టే అని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. రోగులకు వైద్యం చేసే డాక్టర్లు సైతం తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.రవీంద్ర, ఇ.జ్యోత్స్న, ఆర్.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీరు అందించాలి

- ప్రత్యేక అధికారి బి.గోపి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గోపి

జనగామ రూరల్: వేసవిలో తాగునీటి కొరత రాకుండా ప్రణాళికా బద్ధంగా ప్రజలకు అందించాలి.. నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని.. ప్రభుత్వం నియమించిన జిల్లా తాగునీటి ప్రణాళిక ప్రత్యేక అధికారి బి.గోపి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేసవి ఎండల తీవ్రత పెరిగిన దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి పోతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ స్థానిక వనరుల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జీపీ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యను గుర్తించి హ్యాండ్ పంపులు, బోర్ వెల్స్ తదితర వనరులను సరైన విధంగా వినియోగించాలని చెప్పారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి దాని ప్రకారం ఎంపీడీఓ వారానికి రెండు గ్రామాలను, ఎంపీఓ రెండు గ్రామాలను పర్యవేక్షించాలని చెప్పారు. ఎస్డీఎఫ్‌కు సంబంధించిన పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయడంతోపాటు మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు త్వరగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ కొమురయ్య, వెంకన్న, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీపీఓ వినోద్‌కుమార్, డీఈఓ రాము, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో కట్టర్ ఉద్యోగి మృతి

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు సందర్భంగా ఘటన



ప్రమాద స్థలిలో శ్రీశైలం మృతదేహం

పాలకుర్తి : విద్యుదాఘాతంతో కట్టర్ మృతి చెందిన సంఘటన వల్మిడి శివారులో జరిగింది. పోలీసులు, విద్యుత్ అధికారులు, స్థానికుల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం తీగారం గ్రామానికి చెందిన బైకాని శ్రీశైలం(30) పదేళ్లుగా విద్యుత్ శాఖలో కాంట్రాక్టు పద్ధతిన కట్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా శనివారం వల్మిడి శివారులోని వావిలాల సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు నిమిత్తం ఎల్‌సీ తీసుకున్నాడు. విద్యుత్ సరఫరా నిలిపి వేశారనే ఆలోచనతో మరమ్మతు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ పైకెక్కడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బలమైన గాయాలతో కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీశైలంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిప్రసన్నకుమార్ తెలిపారు.

కేసీఆర్ రూ.లక్ష కోట్లు పోగేసుకున్నాడు

- ఆ ఆస్తులను ప్రజలకు పంచాలి
- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



వాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కొమ్మూరి

జనగామ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రూ.లక్ష కోట్ల ఆస్తులు పోగేసుకున్నాడు.. సమగ్ర విచారణ చేపట్టి వాటిని ప్రజలకు పంచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. తుక్కుగూడలో కాంగ్రెస్ జనజాతర బహిరంగ సభ నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రం నుంచి తరలిన పార్టీ శ్రేణుల వాహన ర్యాలీని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఉద్యమం పేరిట అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ప్రజల సొమ్మును అప్పనంగా దోచుకున్నాడని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా ఎన్నో కుట్రలు, కుతంత్రాలతో పాటు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపించారు. నమ్మించి గొంతు కోసినందుకు ప్రజలు ఇంటికి పంపినా సిగ్గులేకుండా రైతులను రెచ్చగొట్టే యాత్రలు చేస్తూ మొసలి కన్నీరు కార్చుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేసీఆర్ పనైపోయిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం ఖాయమన్నారు. భువనగిరి, వరంగల్‌లో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. టీపీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, సర్వల నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, నాయకులు బడికె ఇందిర, బనుక శివరాజ్‌యాదవ్, వంగాల కల్యాణి మల్లారెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, లింగాల నర్సిరెడ్డి, జక్కుల అనిత, గంగం నర్సింహారెడ్డి, కాయితాపురం మహేందర్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్ధిరాములు, చెంచారపు కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్వీప్'తో ఓటర్లలో చైతన్యం తేవాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. ఓటు విశిష్టతను తెలియజేస్తూ ఆ హక్కును వినియోగించుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కళాశాలల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తించి 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన ఉండేలా ఇంటింటి ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. యువ ఓటర్లు పెరిగేలా స్వచ్ఛంద సంస్థల ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అసమర్థ పాలనతో ఎండుతున్న పంటలు

- రైతు నిరసన దీక్షలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, నాయకులు

జనగామ: కాంగ్రెస్ అసమర్థ పాలనతో యాసంగిలో రైతులు సాగు చేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తాలో శనివారం నిర్వహించిన రైతు నిరసన దీక్షలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సర్కారుకు ముందు చూపు లేకపోవడంతో పంటలు ఎండాయని, ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసే ధాన్యానికి మద్దతు ధరతోపాటు బోనస్‌గా రూ.500 చెల్లించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేసుకుంటూ పాలన సాగించిన కేసీఆర్‌ను ఎందుకు ఓడించామా అని ప్రజలు మదనపడుతున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందు సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, నాయకులు, ప్రజాప్రతినిధులు పసుల ఏబేలు, ఇర్రి రమణారెడ్డి, బోడిగం చంద్రారెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, మద్దికుంట రాధ, పగిడిపాటి సుధ, సూకంటి లక్ష్మీశ్రీశైలం, గంగాభవానీ, మామిడాల రాజు, తిప్పారపు విజయ్, ఉల్లెంగుల సందీప్, రాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత తరగతులు

జనగామ రూరల్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఈనెల 8వ తేదీ నుంచి ఉచిత తరగతులు ప్రారంభమవుతాయని ఎస్సీ సంక్షేమాధికారి దయానందరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ 1,2,3,4తో పాటు బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఈ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లా కేంద్రం ధర్మకంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(కోఎడ్యుకేషన్)లో మూడు నెలల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో తరగతులు ఉంటాయని, నేటి ఉదయం 9 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు.

కేరింతలు కొడుతున్న విద్యార్థులు





కలర్‌ఫుల్ ఫెస్ట్

అద్వితీయంగా స్ప్రింగ్‌స్ప్రీ–24 రాసెంగాన్

- ఆకట్టుకున్న టాక్ షో, డైరెక్టర్స్ కట్
- ఉర్రూతలూగించిన అల్యూర్ ర్యాంప్‌వాక్, ప్రో షోలో నకాశ్ అజీజ్
- నేటితో ముగియనున్న వసంతోత్సవం



పాట పాడుతున్న గాయకులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న వసంతోత్సవ వేడుకల్లో శనివారం రెండోరోజు కల్చరల్ ఫెస్ట్ కలర్‌ఫుల్‌గా నిలిచింది. విద్యార్థులు ఉత్సాహంగా 35కు పైగా ఈవెంట్లలో పాల్గొన్నారు. నిట్ మ్యూజికల్, ఫిల్మ్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిట్ సోలో ఐడల్, ర్యాప్ ఐడల్, హంగర్ గేమ్స్, వాట్స్ డిఫరెంట్, ఫిల్మ్ హంట్, మాస్టర్ చెఫ్, కరావోకే, ఫొటో పజిల్ ఈవెంట్లు ఆకట్టుకున్నాయి.

టాక్‌షో, డైరెక్టర్స్ కట్ అదుర్స్

నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో టాక్‌షోలో భాగంగా సినీ నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా టాక్‌షో, డైరెక్టర్స్ కట్‌లో భాగంగా గామీ సినిమా డైరెక్టర్ విద్యాధర్ కాగితాలతో విద్యార్థులు చేసిన చిట్‌చాట్ ఆకట్టుకుంది.

అదరగొట్టిన అల్యూర్, ప్రో షో

అల్యూర్‌లో విద్యార్థులు మోడల్స్‌గా ర్యాంప్ వాక్ చేసి అదరగొట్టారు. ప్రోషోలో బాలీవుడ్ సింగర్ నకాశ్ అజీజ్, ది బ్లాక్ స్మిత్ ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. విద్యార్థులు చిందులు వేశారు.

నేటితో ముగియనున్న వేడుకలు

మూడ్రోజుల వసంతోత్సవ వేడుకలు ఆదివారంతో ముగియనున్నాయి. ముగింపు కార్యక్రమానికి సీతారామం సినిమా డైరెక్టర్ హను రాఘవపూడి, హీరో నవదీప్ హాజరు కానున్నారు. వీరి చిట్‌చాట్‌తో స్ప్రింగ్‌స్ప్రీ–24 ముగియనుంది.

కేయూ సమాచారం..

16 నుంచి ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సు మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 16వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్ నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక శనివారం తెలిపారు. ఈనెల 16 పేపర్-1 ఇంగ్లిష్ , 18న పేపర్-2 పొలిటికల్‌సైన్స్, 20న పేపర్ -3 ఎకనామిక్స్, 22న నాలుగో పేపర్ సోషియాలజీ పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

16 నుంచి మూడేళ్ల 'లా' మొదటి సెమిస్టర్‌పరీక్షలు..

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల 'లా' కోర్సు మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 16నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 16న మొదటి పేపర్ లా ఆఫ్ కాంట్రాక్టు, 18న పేపర్-2 ఫ్యామిలీ లా -1 (హిందూ లా), 20న మూడో పేపర్ కాన్సిటిట్యూషనల్ లా -1 , 22న పేపర్-4 లా ఆఫ్ టూర్స్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ లా , 24న పేపర్ -5 ఎన్విరాన్‌మెంట్ లా పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఆయా పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

15 నుంచి ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలు..

కాకతీయ యూనివర్సిటీ ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల15, 18, 20, 22 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయన్నారు.

బీఫార్మసీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్ష ఫీజులు చెల్లించాలి

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ (సీబీసీఎస్) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ల (సప్లిమెంటరీ అండ్ ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు అపరాధ రుసుము లేకుండా గడువు ఈ నెల 18 వరకు ఉందని అధికారులు తెలిపారు. రూ. 250 అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీవరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు ఉందన్నారు. వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్ అండ్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేయూ ఆన్‌లైన్.కో.ఇన్‌లో చూసుకోవచ్చునని తెలిపారు.

ఈత.. ఆరోగ్య ప్రదాత

- స్విమ్మింగ్‌తో చక్కటి వ్యాయామం
- రోజూ సాధన చేస్తే ఆరోగ్యం పదిలం
- డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌కు జనం తాకిడి



స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

వరంగల్‌స్పోర్ట్స్: వేసవి ఆరంభంలోనే ఎండ దంచికొడుతుంది. వారం రోజుల నుంచి పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందడానికి చల్లటి పానియాలు తాగడమే కాదు, చక్కటి వ్యాయామం కోసం స్విమ్మింగ్ చేయడానికి బయలుదేరుతున్నారు. పది, ఇంటర్, డిగ్రీ పరీక్షలు పూర్తి కావడం.. పాఠశాల విద్యార్థులకు ఒంటి పూట బడులు కావడంతో చిన్నాపెద్ద తేడా లేకుండా స్విమ్మింగ్‌పూల్ బాట పడుతున్నారు. దీంతో హనుమకొండ బాలసముద్రంలోని స్విమ్మింగ్‌పూల్ కళకళలాడుతోంది. ఈ నేపథ్యంలో స్విమ్మింగ్ వల్ల ప్రయోజనాలు, స్విమ్మింగ్‌లో స్టైల్స్, స్విమ్మింగ్ పూల్ వేళలు, ఫీజుల వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

కేటగిరీ	కేటగిరీ డిటెయిల్స్	నెలకు ఫీజు	అడ్మిషన్ ఫీజు
1	అడల్ట్స్	1000	1500
2	చిల్డ్రన్(అండర్-12)	800	1000

కేటగిరీ	ఉదయం	కేటగిరీ	సాయంత్రం
జనరల్	6.00-6.45	మహిళలు	4.00-4.45
జనరల్	6.45-7.30	జనరల్	4.45-5.30
జనరల్	7.30-8.15	జనరల్	5.30-6.15

వ్యాయామ క్రీడల్లో ఈత అతిముఖ్యం

శరీరంలోని ప్రతిభాగానికి వ్యాయామం అందించే క్రీడల్లో 'ఈత' అతి ముఖ్యమైంది. 1828లో మొదటిసారి లండన్‌లో మొదలైన ఈ స్విమ్మింగ్ పోటీల్లో ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, బటర్‌ఫ్లై ఈవెంట్లు అభివృద్ధి కావడానికి సుమారు వందేళ్లు పట్టింది. పాశ్చాత్య దేశాల్లో ప్రసిద్ధి చెందిన ఈ ఆట భారత్‌లో తొలిసారి 1926లో కోల్‌కతా క్లబ్‌లో నిర్వహించారు. ఒలింపిక్స్, కామన్వెల్త్, ఏషియన్ గేమ్స్, జాతీయస్థాయి పోటీల్లో స్విమ్మింగ్ క్రీడకు ఎంతో ప్రాధాన్యం ఉంది.

ఫ్రీస్టైల్..

క్రీడాకారుడికి వచ్చిన స్విమ్మింగ్ స్టైల్‌నే ఫ్రీస్టైల్ అంటారు. ఇందులో రెండు కాళ్లను ఆల్టర్‌నేట్‌గా కదిలిస్తూ, రెండు చేతులను కూడా ఆల్టర్‌నేట్‌గా నీళ్లలో తోస్తూ తల పక్కకు తిప్పి బ్రీతింగ్ తీసుకుంటూ ఈదుతుంటారు. ఇందులో 1500, 800, 400, 200, 100, 50 మీటర్ల ఈవెంట్లు ఉంటాయి. ఇందులో నలుగురితో రిలే కూడా ఉంటుంది.

బ్యాక్‌స్ట్రోక్..

బ్యాక్‌స్ట్రోక్‌లో స్విమ్మర్లు వెల్లకిలా పడుకుని కాళ్లు, చేతులను ఆల్టర్‌నేట్‌గా తిప్పుతూ ముక్కుతో గాలి వదిలి, నోటితో గాలి తీసుకుంటూ ముందుకు సాగాలి. చేతులతో నీళ్లను ముందుకు తోస్తూ ఈద దాన్ని బ్యాక్‌స్ట్రోక్ అంటారు. ఇందులో 200,100,80 మీటర్ల ఈవెంట్లు ఉంటాయి.

బ్రెస్ట్‌స్ట్రోక్ ..

బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్‌లో రెండు కాళ్లను దగ్గరికి తీసుకుని ఒకటేసారి వెనక్కి తన్నాలి. అదే విధంగా చేతులను కూడా ఒకేసారి ముందుకు అని నీళ్లను వెనుకకు లాగుతూ తలను లేపి నోటితో బ్రీతింగ్ తీసుకుని తిరిగి తలను ముంచి చేతులను ముందుకు అంటూ గాలిని నీళ్లలో వదలాలి. ఇందులో కూడా 400, 200, 100, 50 మీటర్ల ఈవెంట్లు ఉంటాయి.

బటర్‌ఫ్లై..



ఈత కొడుతున్న బాలికలు

బటర్‌ఫ్లై ఈవెంట్‌లో రెండు కాళ్లు ఒకేసారి కొట్టి (డాల్ఫిన్‌కిక్) హిప్ అని లేచి రెండు చేతులు ఒకేసారి లేపిన సమయంలో తల లేపి నోటితో గాలి తీసుకుంటూ ముందుకెళ్లాలి. చేతులు పైకి లేపిన సమయంలో తలను పైకెత్తి బ్రీతింగ్ తీసుకుని తల ముంచిన సమయంలో బ్రీతింగ్ వదలాలి. 200, 100, 50 మీటర్ల ఈవెంట్లు ఉంటాయి.

ఇండువిద్యుయల్ మెడిలే..

ఇందులో మొదట బటర్‌ఫ్లై 50, తర్వాత బ్యాక్‌స్ట్రోక్ 50, బ్రెస్ట్‌స్ట్రోక్ 50, ఫ్రీస్టైల్ 50 మీటర్లు చేస్తూ ముందుకు సాగాలి. 400 ఐఎంలో 100 మీటర్ల బటర్‌ఫ్లై 100 మీ. బ్యాక్‌స్ట్రోక్, 100 బ్రెస్ట్ స్ట్రోక్, 100 మీ. ఫ్రీస్టైల్ చేస్తారు. 200 ఐఎంలో 50 మీ. చొప్పున నాలుగు ఈవెంట్లు చేస్తూ ముందుకు సాగుతారు. ఇందులో నలుగురితో రిలే కూడా ఉంటుంది.

నియమాలు.. నిబంధనలు

స్విమ్మింగ్ మొదలయ్యే ముందు ఫస్ట్ లాంగ్ విజిల్ వేయగానే క్రీడాకారులు సిద్ధం కావాలి. ఆన్‌ది బ్లాక్ అని ఒక ఇన్‌స్ట్రక్షన్ ఇవ్వగానే క్రీడాకారులు డైవింగ్ బోటు పైకి ఎక్కాలి. టేక్‌యువర్ మార్క్ అనగానే క్రీడాకారులు వారి పొజిషన్‌లో రెడీగా ఉండాలి. షార్ట్ విజిల్ వేయగానే క్రీడాకారులు డైవింగ్ చేస్తూ పోటీ పడాలి. స్విమ్మింగ్ కాంపిటీషన్ ఎనిమిది లైన్లలో సాగుతుంది. ప్రతి ఒక్కరికీ 2.5 మీటర్ల వెడల్పు స్థలం ఉంటుంది. వారికి కేటాయించిన లైన్ దాటి మరొక లైన్‌కు వెళ్తే ఆ క్రీడాకారుడిని డిస్‌క్వాలిఫై చేస్తారు. డైవింగ్ ద్వారా నీళ్లలో దూకిన సమయంలో అండర్ వాటర్‌లో 15 మీటర్ల దూరం దాటితే వారిని కూడా డిస్‌క్వాలిఫై చేస్తారు. స్విమ్మింగ్ స్ట్రోక్‌లో తప్పుగా చేసినా, ఒక స్ట్రోక్ బదులు మరొక స్ట్రోక్ చేసినా డిస్‌క్వాలిఫై వేటు తప్పదు. ఈ పోటీల్లో ఎవరు ముందు గమ్యం చేరుతారో వారిని ప్రథమ, తర్వాత వచ్చే వారిలో ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేస్తారు.

వేసవి ఆరంభంలోనే సంఖ్య పెరుగుతుంది



అంతర్జాతీయ ప్రమాణాలతో డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ నిర్మితమైంది. అందుకే ఇందులో స్విమ్మింగ్ నేర్చుకోవడానికి, సాధన చేయడానికి ఆసక్తి కనబరుస్తారు. సంవత్సరంలో ఈత నేర్చుకునే వారి సంఖ్య సాధారణంగా ఉంటుంది. వేసవిలో మాత్రం వారి సంఖ్య రెట్టింపు అవుతుంది. ఇప్పటికే కొత్త అడ్మిషన్లతో సంఖ్య పెరుగుతూనే ఉంది. సీజన్‌తో సంబంధం లేకుండా 100 మంది వరకు రెగ్యులర్‌గా స్విమ్ చేస్తుంటారు.

-రాయబారపు నవీన్, స్విమ్మింగ్ కోచ్, డీఎస్‌ఏ, బాలసముద్రం

స్విమ్మింగ్ అంటే ఇష్టం..



స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం. పూల్‌లో ప్రాక్టీస్ చేస్తుంటే థ్రిల్ అనిపిస్తోంది. ఈ వేసవి సెలవుల్లో స్విమ్మింగ్‌లో పర్‌ఫెక్ట్ అయ్యి కాంపీటిషన్‌లో పాల్గొంటా. వేసవి సెలవులను స్విమ్మింగ్‌తో ఎంజాయ్ చేస్తున్నా. ఇక నుంచి రోజూ స్విమ్మింగ్‌కు వస్తా.

అర్జున్‌రావు, హనుమకొండ

ముగిసిన సంతోష్ ప్రస్థానం

23 ఏళ్ల క్రితం అడవిబాట పట్టిన అన్నె సంతోష్ అలియాస్ సాగర్

- దళసభ్యుడి నుంచి.. దండకారణ్య తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఎదిగిన నేత
- చివరికి ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి..
- ఆయన స్వస్థలం కాటారం మండలం అంకుషాపూర్
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు



సంతోష్ తల్లిదండ్రులు



సంతోష్ మృతదేహం

కాటారం : విప్లవ గీతాలకు ఆకర్షితుడై, నమ్మిన సిద్ధాంతం కోసం 23 ఏళ్ల క్రితం అడవిబాట పట్టిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుషాపూర్‌కు చెందిన మావోయిస్టు అన్నె సంతోష్ అలియాస్ సాగర్ ప్రస్థానం ముగిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పూజారి కాంకేర్ సమీపంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో అన్నె సంతోష్ అలియాస్ సాగర్ మృతి చెందాడు. ఈ మేరకు బీజాపూర్ పోలీసులతో పాటు కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి.. సంతోష్ మృతిని నిర్ధారించారు.

18 ఏళ్ల వయసులో అడవి బాట..

కాటారం మండలం అంకుషాపూర్‌కు చెందిన అన్నె సమ్మక్క, ఐలయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక్క కుమార్తె. వారిలో మొదటి కుమారుడు సంతోష్ కాగా, ఇద్దరు కవలలు రామ్ లక్ష్మణ్, కుమార్తె హైమావతి. సంతోష్ బాల్యం తన అమ్మమ్మ ఇంటి వద్ద మహాముత్తారం మండలం దుంపిళ్లపల్లిలో కొనసాగగా 7వ తరగతి వరకు అంకుషాపూర్‌లో చదువుకున్నాడు. భూపాలపల్లి మండలం ఆజాంనగర్‌లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి వరకు చదివాడు. పలు కారణాలతో చదువు మానేసిన సంతోష్.. డ్రైవింగ్ నేర్చుకుని జీప్, కారు డ్రైవింగ్‌కు వెళ్తుండేవాడు. తన 18వ ఏట దుంపిళ్లపల్లికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. అప్పటి పీపుల్స్‌వార్ విప్లవ రచనలు, గీతాలకు ఆకర్షితుడై వివాహం జరిగి ఆరు నెలలు గడవక ముందే 2001లో అడవి బాట పట్టాడు. గ్రామ పరిసరాల్లోకి అన్నలు వచ్చారనే సమాచారం తెలుసుకున్న సంతోష్.. అక్కడికి వెళ్లి వారితో పాటు వెళ్లిపోయాడు. విషయం తెలియని తల్లిదండ్రులు డ్రైవింగ్‌కు వెళ్లాడని అనుకోగా ఆ సమయంలో కాటారం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సదానందం గ్రామంలోకి వచ్చి మావోలతో వెళ్లినట్లు తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

23 ఏళ్లుగా పలు బాధ్యతల్లో..

2001లో మావోయిస్టుల్లో చేరిన అన్నె సంతోష్ అలియాస్ సాగర్ 23 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. మొదట దళసభ్యుడిగా, కొన్ని ఏళ్ల తర్వాత అసిస్టెంట్ దళ కమాండర్‌గా, డివిజనల్ కమిటీ మెంబర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సంతోష్ కమిట్మెంట్‌ను గుర్తించిన మావోయిస్టు అగ్ర నాయకత్వం.. ఇటీవల దండకారణ్య తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌తో పాటు సెకెండ్ సీఆర్‌సీ కమాండర్‌గా బాధ్యతలు అప్పగించింది. 23 ఏళ్ల ప్రస్థానంలో ఏనాడు పోలీసులకు చిక్కని సంతోష్ శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాశాడు. కాగా, ఎన్‌కౌంటర్‌లో సంతోష్ మృతి చెందాడనే వార్త ఉదయమే గ్రామంలో విస్తరించింది. బీజాపూర్ పోలీసులు సంతోష్‌గా నిర్ధారించి స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. సంతోష్ మృతి విషయం గ్రామంలో చక్కర్లు కొట్టినా తల్లిదండ్రులు మాత్రం ఇందులో చనిపోయింది తమ కొడుకు కాదని ధీమాతో ఉన్నారు. అంతేకాకుండా వారు ఐనవోలు జాతరకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. సంతోష్ ఫైల్ ఫొటో చూపించినా వారు గుర్తుపట్టలేదు. దీంతో సాయంత్రం వరకు పోలీసులు సైతం సంతోష్ మృతిని నిర్ధారించలేకపోయారు. చివరకు మావోయిస్టులు లేఖ విడుదల చేయడంతో సంతోష్ మృతిని అధికారికంగా నిర్ధారించారు.

పేదరికంలో తల్లిదండ్రులు..

వృద్ధులైన సంతోష్ తల్లిదండ్రులు సమ్మక్క, ఐలయ్య పేదరికంలో కాలం వెల్లదీస్తున్నారు. సరైన ఇళ్లు కూడా లేకపోవడంతో గుడిసెలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. చేతికి వచ్చిన కొడుకు 18 ఏళ్లలో అడవి బాట పట్టగా.. రెండో కొడుకు కొంత కాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. చిన్న కొడుకు పెళ్లి చేసుకొని వేరుగా ఉంటున్నాడు. దీంతో వారు కూలీ చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు.

పోలీసుల సహకారం..

పేదరికంలో కొనసాగుతున్న సంతోష్ తల్లిదండ్రులకు కాటారం పోలీసులు పలుమార్లు సాకారం అందిస్తూ వస్తున్నారు. నిత్యం వారి బాగోగోలు తెలుసుకోవడంతో పాటు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తుంటారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల కోసమైన సంతోష్ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసులు అనేకమార్లు సందేశమందించారు.

22 ఏళ్ల క్రితం చూసినం..

మా కొడుకు అన్నల్లోకి పోయి 23 ఏళ్లు అవుతుంది. 18 ఏళ్లు ఉన్నప్పుడు అన్నల్లోకి పోయిండు. ఏడాది అయినాక ఓ రోజు రాత్రి అన్నలతోని గ్రామంలోకి వచ్చాడు. అప్పుడు చీకట్లో చూసినం. ఇది వరకు ఏ రోజు కూడా మా కొడుకు మొఖం తెల్వదు, మాట తెల్వదు. ఏదో కానరాని అడువుల్లో ఉంటాండు అని వాళ్లు, వీళ్లు చెబుతుంటే విన్నం. ఎప్పుడైన ఇటు దిక్కు వస్తే కాళ్లు పట్టుకొని ఇంటికాడనే ఉంచుకుందామని చూసినం. కానీ ఆ దేవుడు ఒక్కసారి కూడా కనికరించలే. ఏడేళ్ల కిందట పక్క రాష్ట్రంల ఎన్‌కౌంటర్ జరిగితే పోలీసోళ్లు మమల్ని ఠాణాకు తీసుకుపోయి మీ కొడుకేనా అని ఫొటోలు చూపించిండ్రు. మా కొడుకు కాదని వచ్చినం. ఇప్పుడు కూడా ఫొటోలో గుర్తుపట్టలేం. మా కడుపు గట్టిది అయితే మా కొడుకు బతికి ఉంటడు. లేకపోతే ఆ దేవుడి దగ్గరికి పోతడు.

- అన్నె ఐలయ్య, సమ్మక్క

సంక్షోభం నుంచి రైతులను కాపాడాలి



జిల్లా సదస్సు ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

వరంగల్ చౌరస్తా: ప్రపంచీకరణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అంతర్జాతీయ ద్రవ్య నిధి, వాణిజ్య సంస్థల అమలు కారణంగా బహుళ జాతి కంపెనీలు, అన్నదాత వ్యతిరేక విధానాలతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో రైతులను ఆ సంక్షోభం నుంచి కాపాడాలని పలు విభాగాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ అబ్బనికుంటలోని రైతు సంఘం భవన్‌లో సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ యాదగిరి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 26న జరిగే జిల్లా సదస్సు ప్రచార కరపత్రాన్ని విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ ఆధారిత పరిశ్రమల మూసివేతతో కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులు పని కోల్పోయే ప్రమాదం ఉందని విమర్శించారు. దేశ ప్రజలకు ఆహార భద్రత ఉండాలన్నా.. రైతుల ఆత్మహత్యలు నివారించాలన్నా.. గ్రామీణ వలసలు తగ్గి నిరుద్యోగం తీరాలన్నా లాభసాటి వ్యవసాయమే పరిష్కారమన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కారించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు జెండా అంబయ్య, ఊరటి అంశాల్ రెడ్డి, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, దామోదర్ రెడ్డి, తోట విజేందర్, సిర్ల రవీందర్, బొల్లు ఎల్లయ్య, కత్తి సుధాకర్, టి ప్రభాకర్, ఆవునూరి రాజు పాల్గొన్నారు.

టార్గెట్ కంప్లీట్..

- ఉమ్మడి జిల్లాలో మార్కెట్ ఫీజు వందశాతం వసూలు
- వివరాలు వెల్లడించిన జేడీఎం మల్లేషం..



జేడీఎం మల్లేషం

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్‌శాఖ నిర్దేశించిన టార్గెట్‌లను సాధించినట్లు వరంగల్ జేడీఎం మల్లేషం తెలిపారు. ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 18 మార్కెట్ కమిటీల పరిధిలో రూ.97.57కోట్లు మార్కెట్ ఫీజులు వసూలు చేయాలని టార్గెట్ విధించగా, ఆర్థిక సంవత్సరం 31వ తేదీ నాటికి రూ.101.85కోట్లు సాధించినట్లు తెలిపారు.

జిల్లా	మార్కెట్ కమిటీ	టార్గెట్	వసూళ్లు
		రూ. కోట్లలో	రూ.కోట్లలో
వరంగల్	వరంగల్	42.00	43.39
	నర్సంపేట	6.20	6.16
	నెక్కొండ	1.40	1.50
	వర్ధన్నపేట	2.25	2.76
హనుమకొండ	పరకాల	2.60	2.94
	ఆత్మకూరు	1.14	1.15
	కమలాపూర్	0.00	1.07
జనగామ	జనగామ	5.87	6.29
	ఘనపూర్(స్టే)	2.57	2.76
	కొడకండ్ల	1.88	2.39
	పాలకుర్తి	0.82	0.74
మహబూబాద్	కేసముద్రం	6.12	6.89
	మహబూబాద్	6.88	7.41
	తొర్రూరు	3.96	2.97
భూపాలపల్లి	కాటారం	2.83	1.52
	చిట్యాల	1.00	1.37
	భూపాలపల్లి	3.15	1.79
ములుగు	ములుగు	6.48	8.63

భక్తిమార్గంతో సంతృప్తి

- త్రిదండి చినజీయర్‌స్వామి
- మదనాపురం వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రవచనాలు



ప్రవచనం చేస్తున్న చినజీయర్‌స్వామి

గూడూరు: మానవ జన్మ గొప్పదని, ప్రతీ ఒక్కరూ భక్తిమార్గంలో పయనిస్తే సంతృప్తి లభిస్తుందని త్రిదండి చినజీయర్‌స్వామి అన్నారు. మండలంలోని మదనాపురంలో ఈ నెల 4 వ తేదీన శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలు జరిగాయి. శనివారం మదనాపురం విచ్చేసిన చినజీయర్‌స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మానవ జీవితంలో భక్తి మార్గం ఎంత అవసరమో ప్రవచనాల ద్వారా తెలియజేశారు. దేవాలయాలను నిర్మించడం దాతలకు భగవంతుడు ఇచ్చే శక్తిని బట్టి ఉంటుందన్నారు. మదనాపురంలో లింగాల రాధిక, సుధీర్‌రెడ్డి దంపతులు రూ. కోటీ 20 లక్షలతో శ్రీవేంకటేశ్వర ఆలయం నిర్మించి ప్రతిష్ఠాపనలు చేయడం ద్వారా వారి జన్మ ధన్యమైందన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో ఇతరులకు సహకారం అందిస్తూ, సేవాభాగ్యం కలిగి ఉండాలని కోరారు. అప్పుడే మానవ జన్మకు సార్థకత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, బీజేపీ ఎస్టీ కమిషన్ జాతీయ అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు యాదవరెడ్డి, మాజీ సర్పంచ్ రణధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగిపై పీఏసీఎస్ సీఈఓ వేధింపులు

- ఉగ్యాగానికి రాజీనామా.. పోలీసులకు ఫిర్యాదు
- సీఈఓపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



తొర్రూరులోని పీఏసీఎస్ కార్యాలయం

తొర్రూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిపై సంఘం సీఈఓ అనుచితంగా ప్రవర్తించడంతోపాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఉద్యోగానికి రాజీనామా చేసి పోలీసులను ఆశ్రయించింది. దీంతో అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. స్థానిక ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి పట్ల ఆ పీఏసీఎస్ సీఈఓ వెలుగు మురళి అనుచితంగా వ్యవహరించడంతోపాటు పలు మార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతోపాటు కార్యాలయంలోని సిబ్బందికి రూ.4వేల మేర వేతనాలు పెంచి సదరు మహిళా ఉద్యోగికి మాత్రం రూ.2 వేలు పెంచి వివక్ష కనబర్చాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తన ఉద్యోగానికి ఇటీవల రాజీనామా సమర్పించింది. లైంగిక వేధింపులు, కార్యాలయంలో దళిత మహిళ అని చిన్నచూపు చూడడంపై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఈఓపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కేసును డీఎస్పీకి అప్పగించినట్లు, తగు విచారణ జరిపి నేరం తేలితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

ఆర్టీఐపై పారదర్శకత ఉండాలి



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్

- మాజీ కమిషనర్ జి. శంకర్ నాయక్

హన్మకొండ: సమాచార హక్కు చట్టం అమలుపై ప్రభుత్వానికి పారదర్శకత, అధికారులు జవాబుదారిగా ఉండాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ గుగులోత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సమాచార హక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఆ వ్యక్తికి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. నిర్ణీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఇక్కడా స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవాలన్నారు. కమిషన్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటుందన్నారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏ శాఖ, అధికారికి లేదన్నారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి అంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు ఎలగేండ్ల వెంకటేష్, ప్రతినిధులు స్రవంతి, హరీష్, కుమారస్వామి, రాజు, వీరేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, నాగరాజు, పవన్, ప్రవీణ్, పెండ్యాల కార్తీక్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.